# మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!

- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మలుపులు
- ఎనిమిది నెలల్లోనే 8 మంది మృత్యువాత
- మలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం



ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న చీకటిమానిపల్లి మలుపు

**తనకల్లు:** మండలంలోని జాతీయ రహదారి–42 మీద ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. నిత్యం మలుపుల వద్ద ఏదో ఒక ప్రమాదం జరిగి ప్రాణ నష్టమో లేదా తీవ్రంగా గాయపడడమో జరగడం సాధారణంగా మారిపోయింది. గత ఎనిమిది నెలల్లోనే రోడ్డు ప్రమాదం రూపంలో 8 మంది మృత్యువాత పడ్డారంటే ఈ మలుపుల వద్ద ప్రయాణం ఎంత ప్రమాదకరమో తెలుస్తోంది. మండలంలోని కోటూరు నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతమైన పేపర్ మిల్లు వరకు ఉన్న జాతీయ రహదారిపై దాదాపు 10 ప్రమాదకరమైన మలుపులున్నాయి.

## ప్రమాదాలు నిత్యకృత్యం

జాతీయ రహదారి–42 మీద ఉన్న మలుపుల వద్ద ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. గత మార్చిలో మండ్లిపల్లి మిట్ట సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరమణ అనే వ్యక్తి లారీ ఢీ కొనడంతో మృతి చెందాడు. ఏప్రిల్ నెలలో కేకే ఫ్యాక్టరీ దగ్గర ఉన్న మలుపు వద్ద వెంకటసాయి గణేష్, కొక్కంటిక్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. జూలైలో పరాకువాండ్లపల్లి మలుపు దగ్గర లారీ ఇంట్లోకి దూసుకెళ్లంతో మహమ్మద్ అనే వ్యక్తి చనిపోయాడు. గంగసానిపల్లి మలుపు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో రామకృష్ణ మృత్యువాత పడ్డారు. సెప్టెంబర్‌లో నారేడాండ్లపల్లి ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ వాహనం ఢీ కొనడంతో శంకరప్ప అక్కడికక్కడే మృతి చెందగా, మొటకలచెరువు టమాట మండిలో పని చేసి ఇంటికి బయలుదేరిన 26 మంది గాయపడ్డారు. చీకటిమానిపల్లి పేపర్ మిల్లు వద్ద బస్సు ఢీ కొనడంతో భార్గవ్ దుర్మరణం చెందాడు. చీకటిమానిపల్లి కేకే ఫ్యాక్టరీ మలుపు వద్ద లారీ ఢీ కొనడంతో నరేష్ అనే యువకుడు చనిపోయాడు.

## ఎదురుగా కనిపించని వాహనాలు..

మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే మలుపుల వద్ద పూర్తి స్థాయిలో ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో పాటు అతి వేగం, మద్యం నడిపి వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం, సీటుబెల్టు, హెల్మెట్ ధరించడకుండా మితిమీరిన వేగంతో వాహనాలను నడడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రజలంటున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి జాతీయ రహదారిపై ఉన్న మలుపుల వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదాలు అరికట్టాలి



మా గ్రామం వద్ద ఉన్న జాతీయ రహదారిపై నాలుగు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. పేపర్ ఫ్యాక్టరీ, ఆర్‌ఆర్ ఫ్యాక్టరీ, చెరువు వద్ద ఉన్న మలుపుల వద్దే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని మలుపుల వద్ద ప్రమాదాలు అరికట్టాలి.
– నాగభూషణరెడ్డి, చీకటిమానిపల్లి తనకల్లు:

### వాహనాలు కనిపించడం లేదు



మా గ్రామం వద్ద రెండు మలుపులున్నాయి. జాతీయ రహదారిపై మలుపు ఎక్కువగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రాత్రి పూట ఇంకా కష్టంగా ఉంటుంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది.
– భాస్కర్‌రెడ్డి, మండ్లిపల్లి, తనకల్లు:

### అవగాహన కల్పిస్తున్నాం



స్థానిక జాతీయ రహదారిపై ఉన్న మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణ కోసం రోడ్డు ప్రమాదాలపై తరచూ వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం వాహనాలు తనిఖీ చేస్తున్నాం. రాత్రి వేళ అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించడం అతి వేగంగా వాహనాలు నడపడం, సీటు బెల్టు, హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం.
– గోపి, ఎస్‌ఐ, తనకల్లు

## క్లుప్తంగా

### విద్యార్థులకు మోడల్ పేపర్ల అందజేత


మోడల్ పేపర్లను అందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

**ధర్మవరం అర్బన్ :** పదో తరగతి మోడల్ పేపర్లను యూటీఎఫ్ ధర్మవరం జోన్ సౌజన్యంతో విద్యార్థులకు వితరణగా అందించామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం పదో తరగతి చదువుతున్న 46 మంది పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పిల్లలకు మోడల్ పేపర్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ధర్మవరం సీఐటీయూ నేత జేవీ రమణ, యూటీఎఫ్ జోన్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

### రేపటి నుంచి దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

**బత్తలపల్లి:** మండలంలో మంగళవారం నుంచి దివ్యాంగుల పింఛన్లు పరిశీలన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా తెలిపిన సమాచారం ప్రకారం 20వ తేదీ జరగాల్సిన పరిశీలన 21వ తేదీకి, 21వ తేదీ జరగాల్సిన పరిశీలన 22వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

### కార్మిక కుటుంబాలకు సాయం


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

**ధర్మవరం:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఆర్థికసాయం అందించారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న నలుగురు కార్మికులు(అపోస్) మృతి చెందారని, వారి కుటుంబాలకు మట్టి ఖర్చు, ఎక్స్‌గ్రేషియా అందించినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సన్, జిల్లా మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు సాకే వెంకటేశులు, ధర్మవరం అధ్యక్షుడు మేకల బాబు, కార్యదర్శి ముకుంద, లక్ష్మి ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

### రంగనాయకుల కల్యాణం


స్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు శ్రీధర్ శర్మ గోదాదేవి, రంగనాయకుల ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలు, వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. భక్తుల సందడి నడుమ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయ 32వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించామని ఆలయ ఈఓ నాగరత్నమ్మ తెలిపారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


చైత్ర

**ధర్మవరం అర్బన్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి బాలికల క్రికెట్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి ఎంపికైనట్లు ఆదివారం ఎస్‌జీఎఫ్ అనంతపురం, సత్యసాయి జిల్లా కార్యదర్శులు సుగుణమ్మ, మోరార్జియాదవ్ తెలిపారు. 2024–25 ఎస్‌జీఎఫ్–17 సీజన్ క్రికెట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన చైత్ర జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారు. ఫిబ్రవరి 3 నుంచి హరియాణాలో నిర్వహించే పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారని క్రీడాకారిణి తండ్రి రాజు తెలిపారు.

### పార్టీ బలోపేతానికి కృషి


ప్రభాకర్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

**ధర్మవరం రూరల్:** వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సత్యసాయి జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి గారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగ్రామమైన చిగిచెర్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కోటి సురేష్‌కుమార్, కోటి నరేష్‌కుమార్


కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్


కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మున్సిపల్ విభాగం అధ్యక్షుడు గజ్జల శివ

**బత్తలపల్లి:** కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలకు పిలుపునిచ్చారు. ధర్మవరంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వగృహంలో ఆయన్ను ఇటీవల కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని బెదిరిస్తున్న వారిని గుర్తు పెట్టుకోవాలని, అలాంటి వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ అధినేత సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసందర్భంగా కూటమి నాయకులు ఇటీవల బత్తలపల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బెదిరింపులు, ఇసుక దందా, స్టోర్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించడం తదితర అంశాలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, సర్పంచు అక్కిం దామోదర్, ఉప సర్పంచు కోళ్లమొర్రం చెన్నక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచు రాఘవంపల్లి గోపీ, నాయకులు ఈడిగ కాశప్ప, జాంపుల చంద్రమోహన్, యోగానంద ఆచారీ, మండల నారాయణ, రాంభూపాల్‌రెడ్డి, బ్యాల్ల పెదయ్య, సాకే సురేష్, కమతం శంకరయ్య, సాకే కిరణ్, గవ్వల రమేష్, లోకేష్, నాగభూషణ, సాకే వన్నూరప్ప, కోటి చంద్ర, బాబావలి, బొంతల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం:** ఇటీవల నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటి విభాగం జిల్లా అధ్యక్షుడు గజ్జల శివ కేతిరెడ్డి ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జగనన్నకు, కేతిరెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. నాయకులు చిన్నూరు తిమ్మన్న, చిన్నూరు రమేష్, దాసరి శ్రీనివాసులు, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, శాగ శ్రీన, యంబా తిరుపాల్, బుగ్గా నాగభూషణ, ఆకుల రామలింగ, ఆకుల రవి, జెన్నే చందు, శివ, జ్యోతి మల్లికార్జున, ఓంప్రకాష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### శుభకార్యం

**బత్తలపల్లి:** పోట్లమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చింతపంటి వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి ఇంట్లో ఆదివారం జరుగుతున్న శుభకార్యానికి ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకోగానే స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలను తెలుసుకుని అందరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్టారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

## నేటి నుంచి ఉచిత పశు వైద్యశిబిరాలు

**బత్తలపల్లి:** పశువులకు, గొర్రెలు, మేకలకు సోమవారం నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాలలో వారు విలేకర్లతో మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించి పశువులకు పరీక్షలు, గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందులు ఉచితంగా తాపిస్తామన్నారు. తొలిరోజు బత్తలపల్లి, గంటాపురం, ఈదుల ముష్టూరు పంచాయతీలు, 21న పోట్లమర్రి, వేల్పుమడుగు, సంజీవపురం, 22న మాల్యవంతం, 23న తంబాపురం, 24న అప్పరాచెరువు, 26న సంగాల, 27న ఓబుళాపురం, 28న గరిశలపల్లి, 29న దంపెట్ల, 30న డి.చెర్లోపల్లి, 31న నల్లబోయనపల్లి పంచాయతీల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు, జీవాల పెంపకందారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**గాండ్లపెంట:** పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి కేశవనాయక్ ఆదివారం తెలిపారు. సోమవారం కమతంపల్లి, సోమయాజులపల్లి, 21న కటారుపల్లి, జీనులకుంట, 22న గొడ్డువెలగల, వేపరాల, 23న తుమ్మలబైలు, రెక్కమాను, 24న టి.పెద్దతండా, చామలగొంది ,25న సాదులవాండ్లపల్లి, మలమీదపల్లి, 27న తూపల్లి, చామచేనుబైలు, 28న మద్దివారిగొంది, గాజులవారిపల్లిపెద్దతండా, 29న గాండ్లపెంట, సింగానివారిపల్లి, 30న నాయనివారిపల్లి, కురుమామిడి, 31న బొలిగుట్లపల్లి, పాయకట్టు గ్రామాల్లో శిబిరాలు ఉంటాయన్నారు.

## వేమన రచనలు సమాజానికి మార్గదర్శకం


ధర్మవరంలో యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు


యోగివేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ మహేష్

**ధర్మవరం:** విశ్వకవి, ప్రజాకవి యోగి వేమన తన రచనలు సమాజానికి మార్గదర్శకమని రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రి రెడ్డి తెలిపారు. పట్టణంలోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో ఆదివారం యోగివేమన జయంతి సందర్భంగా పలువురు రెడ్డి జేఏసీ నాయకులు యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఆర్డీఓ మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగి వేమన రచనల విశిష్టతను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఏఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగి వేమన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన పద్యాలు, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్:** మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయి మనోహర్ వేమన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ అబ్దుల్ నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నివాళి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

**నల్లమాడ:** వంకరకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బెడుదూరి ఓబిరెడ్డి తండ్రి కుళ్లాయిరెడ్డి(78) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి గ్రామానికి చేరుకుని కుళ్లాయిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, సర్పంచ్ కుళ్లాయప్ప, సహకార సంఘం మాజీ అధ్యక్షులు ఏ. గంగిరెడ్డి, నాయకులు అరవిందరెడ్డి, ఓబిరెడ్డి, కేశప్ప, నాగప్ప, రాజారెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

**కదిరి టౌన్:** పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ బార్ సమీపంలో అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..నల్లచెరువు మండలం గొర్లవారిపల్లికి చెందిన గోవింద్(46) కొద్ది రోజుల క్రితం సౌదీలో ఉండి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. మద్యానికి బానిసైన అతడు ఆదివారం అతిగా మద్యం సేవించి ఎస్‌ఎల్‌వీ బార్ సమీపంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

**చెన్నేకొత్తపల్లి:** బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే కఠినంగా శిక్షిస్తామని చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్ హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మద్యం సేవించి ఖాళీ బాటిల్, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు పడేస్తుండటంతో సాక్షి దినపత్రికలో ఇటీవల వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎక్సైజ్ సిబ్బంది రాత్రి సమయంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పరిసరాల్లో నిఘా పెట్టినట్లు తెలిపారు. మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### బాధితురాలికి డబ్బు అందజేత

**పుట్టపర్తి టౌన్:** ప్రశాంతినిలయంలో గేటు వద్ద డబ్బు పోగొట్టుకున్న మహిళకు నగదును తిరిగి అప్పగించారు. అనంతపురం సమీపంలోని రుద్రంపేటకు చెందిన మహిళ ఆదివారం సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం ప్రశాంతి నిలయానికి వచ్చింది. ఈక్రమంలో రామాలయం గేటు సమీపంలో పర్సు పోగొట్టుకుంది. సెక్యూరిటీ వింగ్ పోలీసులు పర్సును గుర్తించి బాధిత మహిళకు అందజేశారు.

### పకడ్బందీగా బందోబస్తు

**తాడిమర్రి:** మండల కేంద్రంలో జరుగుతున్న ఇస్తేమా కార్యక్రమంలో బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన ఇస్తేమా జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముదిగుబ్బ, బత్తలపల్లి, రామగిరి సీఐలు శ్యామ్‌రావు, శివరాముడు, ప్రభాకర్, శ్రీధర్, ఎస్‌ఐలు కృష్ణవేణి, సోమశేఖర్ ఉన్నారు.

### హోం మంత్రి రాజీనామా చేయాలి


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

**కదిరి టౌన్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ సర్కిల్ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు తగవన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని చెప్పిన కేంద్రం ప్రైవేటీకరణ ఎత్తేస్తున్నామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, ముస్తక్, లియాకత్, పవన్‌కుమార్, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### కంటి వైద్యశిబిరం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 98మందికి కంటి పరీక్షలు చేయగా 75 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. వీరికి బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేస్తారన్నారు. అనంతరం వైద్యులు, శిబిరం దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, కార్యదర్శి నాగభూషణ, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, శ్రీనివాసరెడ్డి, కృష్ణమూర్తి రామకృష్ణ, కొండయ్య, రమేష్, రత్నశేఖర్ రెడ్డి, పెరుమాల్‌దాస్, విజయభాస్కర్, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

### గుండె వైద్యశిబిరం

**కదిరి టౌన్:** పట్టణంలో ఆదివారం కదిరి రోటరీ క్లబ్, డాక్టర్ ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లల వైద్యుడు సివి.మదన్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 150 మందికి ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. రోటరీక్లబ్ సభ్యులు పచ్చిపులుసు రాఘవ, కిశోర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తాహిర్‌వలి, గణేష్, అభినయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మ దేవతకు పూజలు

**ముదిగుబ్బ:** బండ్లపల్లి సమీపంలోని గంగమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అమ్మవారికి దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం ఆయన బండ్లపల్లికి చెందిన వెంకటరమణ ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, బయపరెడ్డి, కిరణ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బైలు గంగమ్మకు బోనాలు

**కదిరి టౌన్:** కుటాగుళ్ల గ్రామ సమీపంలోని బైలు గంగమ్మ దేవతకు భక్తులు ఆదివారం బోనాలు పట్టారు. భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి జంతు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

### ఈద్గా సమీపంలో చెలరేగిన మంటలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ ఈద్గా మైదానం సమీపంలో శనివారం అర్ధరాత్రి ఆకతాయిలు పెట్టిన నిప్పుతో మంటలు చెలరేగాయి. ఈద్గా సమీపంలోనున్న ముళ్లకంపలు, గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు దావానంలా వ్యాపించాయి. స్థానికులు మంటలను ఆర్పివేశారు. సమీపంలో ఎక్కడా నివాసాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

### మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం ధర్మవరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్స్ అడ్వైజింగ్ సభ్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, అబ్దుల్లా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ధర్మవరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సయ్యద్, కార్యదర్శిగా మనోహర్, ట్రెజరర్‌గా రవిని ఎంపిక చేశారు.